

కీమో థెరపీ కోసం ఏర్పాటు చేసిన మంచాలు



క్యాన్సర్ యూనిట్ బాగయ్యేనా..!



వైసీపీ హయాంలో నిర్వహణ గాలికి..

- నాలుగేళ్లుగా ఆగిపోయిన రేడియో థెరపీ సేవలు
- బాగు చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- రూ.2 కోట్లు వెచ్చించి కోబాల్ట్ సోర్స్ కొనుగోలు
- నూతన భవన నిర్మాణానికి ప్రణాళికలు

అనంతపురం వైద్యం, జూలై 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాన్సర్ యూనిట్‌ను బాగు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆగిపోయిన రేడియో థెరపీ సేవలను పునః ప్రారంభించేందుకు రూ.2 కోట్లు వెచ్చించి కోబాల్ట్ సోర్స్‌ను తెప్పిస్తోంది. దీంతోపాటు నూతన భవనాన్ని నిర్మించి, మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అనుబంధంగా శారదానగర్‌లో క్యాన్సర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అత్యంత ఖరీదైన క్యాన్సర్ వైద్య సేవలను 2014లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. క్యాన్సర్ యూనిట్‌లో ఓపీ, కీమో, రేడియో థెరపీ సేవలు అందించేవారు. అడ్మిషన్ మాత్రం సర్వజన వైద్యశాలలో చేసుకుంటారు. టెలీ కోబాల్ట్ యంత్రంలో కోబాల్ట్ సోర్స్ అయిపోవడంతో నాలుగేళ్లుగా రేడియో థెరపీ సేవలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం క్యాన్సర్ యూనిట్ నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో క్యాన్సర్ బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి రూ.లక్షల్లో ఖర్చు పెట్టుకుంటున్నారు.

మూలన చేరిన యంత్రం

రేడియో థెరపీకి రేడియోధార్మిక ఐసోటోప్ కలిగిన కోబాల్ట్ యంత్రాన్ని ఉపయోగిస్తారు. కోబాల్ట్ సోర్స్ నుంచి వెలువడే గామా కిరణాల ద్వారా క్యాన్సర్ కణాలను నశింపజేస్తారు. చర్మం, నాలుక, స్వరపేటిక, మెదడు, రొమ్ము, గర్భాశయం తదితర క్యాన్సర్ బాధితులకు రేడియో థెరపీ చేస్తారు. క్యాన్సర్ యూనిట్‌లోని రేడియో థెరపీ యంత్రంలో కోబాల్ట్ సోర్స్, సోర్స్ హెడ్, సోర్స్ డ్రాయర్, కొలిమీటర్, గాంట్రీ, కంట్రోలర్, కంట్రోల్ కన్సోల్ తదితరాలను సర్వీస్ చేయాల్సి ఉంటుంది. పదేళ్లపాటు పనిచేసేయాల్సిన ఈ యంత్రం ఏడేళ్లకే మరమ్మతులకు వచ్చింది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో యంత్రాన్ని వృథాగా వదిలేశారు. కీమో థెరపీ మాత్రం కొనసాగుతోంది.

రూ. కోట్ల ఖర్చుతో..

క్యాన్సర్ యూనిట్‌లో రేడియో థెరపీ చికిత్స ప్రక్రియను 2009లో మొదలుపెట్టి.. 2014లో అందుబాటులోకి తెచ్చారు. ప్రతి వంద మంది క్యాన్సర్ బాధితుల్లో 50 మందికి రేడియో థెరపీ చేయాల్సి వస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. కోబాల్ట్ సోర్స్ అయిపోవడంతో 2021 నుంచి సేవలను నిలిపివేశారు. కోబాల్ట్ సోర్స్‌ను కొనుగోలు చేయడం ఖరీదైన వ్యవహారమే కాదు.. కఠిన (మిగతా 7లో...)

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్

నార్పల, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని బొందలవాడ గ్రామ పంచాయతీలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన అసిస్టెంట్ కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అనంతపురం నగరంలో ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా దానిని అమలు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలు కూడా ఇంటా, బయట, కార్యాలయాల్లో, పాస్లిక్ వినియోగాన్ని మానేయాలన్నారు. బొందలవాడ గ్రామానికి బీటీ రోడ్లు, ఓపెన్ జిమ్, కాలువలను మంజూరు చేస్తామన్నారు.

గోకులం షెడ్‌ను ప్రారంభించిన కలెక్టర్

గ్రామంలో రైతు రామాంజనేయులు ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన గోకులం షెడ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం రైతుతో పాడి గురించి వివరాలు ఆరా తీశారు. అనంతరం అక్కడే కంపోస్ట్ పిట్‌కు భూమి పూజ చేశారు. గ్రామంలో ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, పీడీ సలీంబాషా, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ మమతాదేవి, సర్పంచు ఆలం శిరీష, ఉప సర్పంచ్ ఆలం వెంకటనరసానాయుడు, ఏపీఓ ఎర్రమ్మ పాల్గొన్నారు.

బిహార్ వాసికి అరుదైన ఆపరేషన్

పామిడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో బీహార్‌కు చెందిన కూలీ గజో సదాకు అరుదైన ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్ రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీ కొత్తపల్లిలోగల ఓ కంపెనీలో బీహార్‌కు చెందిన గజోసదా పనికెళ్తున్నాడు. అరుదైన ఇంగ్యునల్ హెర్నియా సమస్యతో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం దక్కలేదు. సీహెచ్‌సీకి వచ్చారు. పరీక్షించిన వైద్యుడు కమలాధర్ శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. వైద్యులు కమలాధర్, ఎల్లప్ప గురువారం శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. దీంతో వైద్యాధికారి హర్షం వ్యక్తం చేశారు.



శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

నెట్టికంటి ఆలయ మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష



ఆలయప్రాంగణంలో స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మాస్టర్‌ప్లాన్‌పై కర్నూలు దేవదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సీహెచ్ శ్రీనివాసులు శనివారం సమీక్షించారు. ఆలయ ప్రాంగణంలో గదులు, కొనేరు, సముదాయ స్థలాలను ఆయన పరిశీలించారు. కార్యాలయంలో మాస్టర్ ప్లాన్ ద్వారా చేపట్టనున్న పనులపై ఆలయ ఈఓ వాణితో చర్చించారు. కార్యక్రమంలో కర్నూలు దేవదాయ శాఖ ఏఈలు, టెక్నీషియన్లు, ఏఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రభుత్వ విప్ కాలవ



తుంగభద్ర జలాలకు వాయనం సమర్పిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

బొమ్మనహాళ్, జూలై19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నీటిని పొదుపుగా వాడుకుని, అధిక దిగుబడులు సాధించాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల సరిహద్దులోని 105వ కిలోమీటరు వద్ద తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)లో వస్తున్న జలాలకు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే జలహారతి ఇచ్చారు. తొలుత పూజలు నిర్వహించి, వాయనం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హెచ్చెల్సీకి జూలై 20వ తేదీలోపే నీటిని తీసుకొచ్చి, జలహారతి ఇచ్చామన్నారు. తుంగభద్ర డ్యాం గేట్లను ఈ ఏడాది మార్చనున్న నేపథ్యంలో నీరు ముందుగానే బంద్ అయ్యే అవకాశాలున్నాయనీ, రైతులు ముందుగా చేతికొచ్చే పంటలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర డ్యాం ఎస్ఈ నారాయణనాయక్, తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అనంతపురం కలెక్టరేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈనెల 21వ తేదీన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హమ్మయ్యా.. వానొచ్చింది..

అనంతపురం అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వానొచ్చింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వాన పడింది. అనంతపురం నగరంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. గుత్తి, బొమ్మనహాళ్, విడపనకల్లు, కూడేరు, పుట్లూరు, నార్పల, గార్లదిన్నె, గుంతకల్లు, శింగనమల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.



అనంతపురం నగరంలో శనివారం రాత్రి వర్షంలో వెళుతున్న జనం

విద్యార్థినుల పట్ల
అసభ్య ప్రవర్తన
- ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రుల దాడి

7లో

22 వరకు డైట్ సెట్ కౌన్సెలింగ్

బడికి పొగ..!

కట్టెలతో మధ్యాహ్న భోజనం తయారీ

- పొగచూరుతున్న తరగతి గదులు
- విద్యార్థులు, టీచర్ల ఉక్కిరి బిక్కిరి



బాలికల ఉన్నత పాఠశాలలో ఆరుబయట కట్టెలతో వంటచేస్తున్న దృశ్యం

కదిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కట్టెల పొయ్యి మీద మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తుండటంతో తరగతి గదులు పొగచూరుతున్నాయి. శ్రద్ధగా పాఠాలు వినే విద్యార్థులు పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అలాగే వండి ఆహార పదార్థాలు కూడా పొగ వాసన వస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. గ్యాస్ స్టౌ మీద వంట చేస్తే తమకు గిట్టుబాటు కావడం లేదన్న నెపంతో కొన్ని మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు కట్టెల మీద వంట వండుతున్నట్లు చెబుతున్నారు. చాలా మండలాల్లో ఎక్కువ శాతం హైస్కూళ్లలో కట్టెల మీదే వంట చేస్తున్నారు. దీన్ని ఆపాఠశాల ప్రధానోపాధ్యాయులుకానీ, ఉపాధ్యాయులు గానీ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరడం లేదు.

పాఠశాలను కమ్మేస్తున్న పొగ

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఇంకా కట్టెలమీదే వంట చేస్తున్నారు. బాలికల ఉన్నతపాఠశాలలో ఒకటి, జూనియర్ కళాశాలలో ఒక మధ్యాహ్న భోజన ఏజెన్సీ ఉన్నాయి. ఈరెండింటికి కలిపి (మిగతా 7వ పేజీలో)

కళ్యాణదుర్గంలో పగలే భారీ చోరీ

- ఉపాధ్యాయ దంపతుల ఇంట్లో చొరబడిన దొంగలు
- 22 తులాల బంగారం, పది తులాల వెండి, నగదు అపహరణ



బీరువాను పగులగొట్టిన దృశ్యం

కళ్యాణదుర్గం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం పగలే దొంగలు భారీ చోరీ చేశారు. పార్వతినగర్‌లోని ఉపాధ్యాయ దంపతుల ఇంట్లో చొరబడి 22 తులాల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి, రూ.20వేల నగదు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజేంద్ర, త్రివేణి దంపతులు టీచర్లు. రాజేంద్ర కళ్యాణదుర్గం మండలం యర్రంపల్లి యూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. త్రివేణి శెట్టూరు ఉన్నత పాఠశాలలో బయాలజీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. వీరిద్దరు అనంతపురంలో విధులు నిర్వర్తిస్తుండేవారు. 15 రోజుల క్రితమే ఈ ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఉద్యోగరీత్యా అనంతపురంలో ఉండటంతో పార్వతినగర్‌లోని సొంత ఇంటిని అద్దెకు ఇచ్చారు. ఈ ప్రాంతానికి బదిలీ కావడంతో తిరిగి సొంత ఇంటికొచ్చారు. అనంతపురం నుంచి లగేజీతోపాటు సొంత ఇంట్లోకి చేరారు. ఇంట్లో ఉన్న డబ్బు, నగలు బ్యాంకు లాకర్‌లో పెట్టాలని మూడు రోజుల క్రితమే దంపతులు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం విధులకు వెళ్లారు. దీనిని అదునుగా తీసుకున్న దొంగలు ఇంటి ప్రహరీ దూకి లోపలికి చొరబడ్డారు. ప్రధాన ద్వారం తాళాలను పగులగొట్టారు. లోపలికి ప్రవేశించి బీరువాను పగులగొట్టి అందులోని ఆభరణాలు, నగదు అపహరించుకెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చిన రాజేంద్ర.. తలుపులు తెరిచి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ యువరాజు ఘటనా ప్రాంతానికి చేరుకుని, డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలించారు. అయినా ఆనవాళ్లు లభించ లేదు. వారం రోజుల నుంచి కొంతమంది కాలనీలో అనుమానాస్పదంగా సంచరించినట్లు తెలిసింది. పూర్తిస్థాయిలో రెక్కీ నిర్వహించిన తరువాతనే ఇద్దరు, ముగ్గురు దుండగులు చోరీకి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



సెక్టోరల్ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగి (ఫైల్)

సమగ్రశిక్షలో చోద్యం..!

సెక్టోరల్ పోస్టుల భర్తీలో వింత నిర్ణయాలు

దరఖాస్తులు స్వీకరించాక, డెప్యుటేషన్ ఆలోచన

కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నా.. ఇష్టారాజ్యం

అనంతపురం విద్య, జూలై19(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఏం జరుగుతోందో అర్థంకాని పరిస్థితి. అధికారులు పూటకో నిర్ణయం తీసుకుంటూ గందరగోళ పరిస్థితి సృష్టిస్తున్నారు. సెక్టోరల్ పోస్టుల భర్తీలో విచిత్ర నిర్ణయాలతో వివాదాలకు తెరలేపుతున్నారు. కీలకమైన ఈ పోస్టులు ఏడాదిగా ఖాళీగా ఉన్నాయి. ఎట్టకేలకు గత నెల వీటి భర్తీకి సమగ్రశిక్ష అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తులు కూడా స్వీకరించారు. వాటిని పరిశీలించి, అర్హులకు అవకాశం కల్పించాల్సి ఉంది. ఈ దశలో అధికారులు నిర్ణయం మార్చుకుంటున్నారు. దరఖాస్తులు పక్కనపడేసి, డెప్యుటేషన్‌పై నియమించుకుంటే పోలా.. అని భావిస్తున్నట్లు సమాచారం. అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

డెప్యుటేషన్లపై విమర్శలు

సెక్టోరల్ పోస్టుల నియామకాలను పక్కనపెట్టి ఇతరులను డెప్యుటేషన్‌పై తీసుకోవాలని సమగ్ర శిక్ష అధికారులు భావిస్తుండడం వివాదానికి తెరలేపుతోంది. సిఫార్సులు వస్తాయన్న సాకుతో మొత్తం నియామక ప్రక్రియనే పక్కన పెట్టాలని అధికారులు భావిస్తుండడం శోచనీయమన్న వాదనలు వినిపిస్తున్నాయి. డెప్యుటేషన్ చర్యలను దరఖాస్తుదారులు వ్యతిరేకిస్తున్నారు. ఇది మరింత ముదిరే అవకాశం లేకపోలేదు. సమగ్రశిక్షకు కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. అయినా.. పట్టించుకోకపోవడం శోచనీయం.

171 దరఖాస్తులు

పాఠశాలలు, ఏఆర్‌సీలు, క్లస్టర్ స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు సమగ్రశిక్ష ద్వారానే నిధులు విడుదలవుతాయి. అలాంటి శాఖలో అత్యంత కీలకమైనవి సెక్టోరల్ పోస్టులు. ఆ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యాపథకాల అమలు, నిధుల ఖర్చు వంటివాటిపై పర్యవేక్షణ కొరవడి క్షేత్రస్థాయిలో అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సెక్టోరల్ పోస్టుల భర్తీకి గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చారు. జూన్ 30వతేదీ వరకు అర్హత కలిగిన టీచర్ల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. మొత్తం ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు అందాయి. ఇందులో ఏఎంఓ పోస్టుకు 37, అసిస్టెంట్ సీఎంఓకి 48, అలెస్కోకి 45, ఏఎస్ఓకి 13, అసిస్టెంట్ ఐఈడీకి 14, అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ)కి 14 చొప్పున టీచర్ల నుంచి దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు స్వీకరించి 20 రోజులైనా నియామకాలపై యంత్రాంగం పట్టించుకోవడం లేదు. దరఖాస్తులను మూలన పడేసి మౌనంగా ఉంటున్నారు.

ప్రత్యేకాధికారి కోసం ఫైల్ పెట్టాం

సెక్టోరల్స్ నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు తీసుకున్నాం. మొత్తం ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు వచ్చాయి. నియామకాల కోసం ఓ ప్రత్యేకాధికారిని నియమించాలని కలెక్టర్‌కు ఫైల్‌పెట్టాం. ఆమోదం తెలపగానే నియామకాల ప్రక్రియ చేపడతాం.

-ప్రసాద్‌బాబు, డీపీసీ, సమగ్రశిక్ష



క్రైం కార్నర్

కౌలు రైతు ఆత్మహత్య

పామిడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కౌలు రైతు ఆదెన్న(70) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నా డు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదెన్న, భార్య నాగమ్మ తోటను కౌలుకు తీసుకుని, పూలు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆదెన్న టీబీ, షుగర్‌తో బాధపడుతుండేవాడు. షుగర్ వల్ల టీబీ నయం కాకపోవడంతో కడుపునొప్పి వచ్చేదన్నారు. కడుపునొప్పి తాళలేక చైతన్య కాలనీ సమీపాన ఖాళీ ప్రదేశంలో పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లినవారు గమనించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని, ఆదెన్నను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఆదెన్నకు నలుగురు కుమార్తెలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక మహిళ..

బ్రహ్మసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన కురువ జ్యోతి (38) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. ఈమె గత ఆరేడు సంవత్సరాల నుంచి కడుపునొప్పితో బాధపడేది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ప్రయోజనం లేకపోయింది. దీంతో భర్త వన్నూరుస్వామి బొలెరో డ్రైవర్‌గా పని చేసి సంపాదించిన సొమ్మంతా తన వైద్యానికే సరిపోతోందని, ముగ్గురు కుమార్తెలను ఎలా పోషించాలని తరచూ మథనపడేది. ఈక్రమంలోనే శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కాసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు ఉరికి వేలాడుతున్న ఆమెను కిందికి దించి పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కళ్యాణదుర్గం తరలించారు.


జ్యోతి (ఫైల్)

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

● ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రుల దాడి


ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగిన తల్లిదండ్రులు

ఉరవకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడేహోతూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సతీష్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు దాడి చేశారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే మండలంలోని చాబాల ఉన్నత పాఠశాలలో పనిచేసిన సతీష్, బదిలీపై గడేహోతూరుకు వచ్చారు. తాము టాయిలెట్‌కు వెళ్లేటపుడు వెంట వస్తున్నాడని, దండించే పేరిట శరీరాన్ని తాకుతున్నారని పలువురు విద్యార్థినులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు శనివారం పాఠశాల వద్దకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు. కోపోద్రిక్తులై ఆయనపై దాడి చేశారు. ఇతర ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి ఉపాధ్యాయుడు తమకొద్దని తల్లిదండులు అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొడవ నేపథ్యంలో ఎస్ఐ నాగస్వామి పాఠశాలకు వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడిపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యవర్గం ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ శనివారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన పదాధికారులు మూడేళ్లపాటు పదవిలో ఉంటారన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా పి నాగరాజు (అనంతపురం), ఎంపీ ఈశ్వర్‌ప్రసాద్ (అనంతపురం), సత్యనారాయణ రెడ్డి (రాయదుర్గం), ఆదినారాయణ (కళ్యాణదుర్గం), మారుతి గోవిందప్రసాద్ (అనంతపురం), ముప్పూరి దేవరాజ్ (కళ్యాణదుర్గం), ప్రధా న కార్యదర్శులుగా సి అశోక్‌రెడ్డి (అనంతపురం), బి శ్రీదేవి (గుంతకల్లు), ఆంజనేయులు (తాడిపత్రి), కార్యదర్శులుగా నాగేంద్రబాబు (అనంతపురం), కవితాశర్మ (గుంతకల్లు), మల్లీశ్వరి (ఉరవకొండ), చైతన్యకిశోర్ (రాప్తాడు), నారాయణరెడ్డి(గుంతకల్లు), అరుణమ్మ (రాయదుర్గం), కోశాధికారిగా ఎంకే అయ్యన్న (అనంతపురం), ఐటీ సెల్ కన్వీనర్‌గా భీమశంకర్ (ఉరవకొండ), సోషల్ మీడియా కన్వీనర్‌గా దినేష్‌రెడ్డి (శింగనమల) ఎంపికయ్యారు.


కమిటీని ప్రకటిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

22 వరకు డైట్ సెట్ కౌన్సెలింగ్

బుక్కపట్నం, జూలై19(ఆంధ్రజ్యోతి): డైట్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ ఈనెల 22వతేదీ వరకు నిర్వహించనున్నట్లు బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకి సంబంధించి కేటాయించిన 156 మంది అభ్యర్థులకుగాను ఇప్పటివరకు 31 మంది అడ్మిషన్ పొందారన్నారు. వీరిలో 21 మంది ప్రభుత్వ డైట్ కళాశాలలో, పదిమంది అనంతపురంలోని బాలాజీ కాలేజీలో చేరారన్నారు. వారు ఈనెల 25వ తేదీ నుంచి కేటాయించిన కళాశాలకు హాజరుకావాలని తెలిపారు.

జర్మన్ భాషపై శిక్షణ

అనంతపురం వైద్యం, జూలై 19(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో జర్మన్ భాషపై శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శిక్షణను డీఆర్వో మలోల ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మొదటి బ్యాచ్‌కు 42మంది విద్యార్థులు ఎంపియ్యారన్నారు. వీసీ, ఫ్లైట్ టిక్కెట్ ఖర్చులు కూడా సంస్థ భరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విజయేశ్వరీదేవి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనంతమ్మ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘనస్వాగతం


జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌కు మొక్కలను కానుకగా ఇస్తున్న అనంత కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌కు ఇరు జిల్లాల ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌కు నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిసి, పూలమొక్క అందించారు.

బడిగాపులు..!

● ముఖహాజరుకు టీచర్ల ఫీట్లు
● సర్వర్ సమస్యతో తిప్పలు


ముఖహాజరు కోసం బుక్కరాయసముద్రం కాంప్లెక్స్‌లో టీచర్లపాట్లు

అనంతపురం విద్య, జూలై19(ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్సు సర్వర్ కష్టాలు ఈసారీ తప్పలేదు. ముఖహాజరుకు టీచర్లు ఫీట్లు చేయాల్సి వచ్చింది. శనివారం 2025-26 విద్యాసంత్సరానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 135 స్కూల్ కాంప్లెక్సులలో సమావేశాలు నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, జడ్పీ, మండల, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 10 వేల మంది టీచర్లు హాజరయ్యారు. ఉదయం పాఠశాలలో విధులు నిర్వర్తించి, మధ్యాహ్నం రెండుగంటల నుంచి తమకు సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల వరకు అందరూ హాజరయ్యారు. ఆ తర్వాతనే ముఖహాజరు అవుట్‌టైమ్ నిబంధన పెట్టారు. సమావేశాలు ముగిసిన తర్వాత టీచర్లు ముఖహాజరు వేయడానికి ప్రయత్నిస్తే సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడ్డారు. అరగంటపాటు అంటే 5.30 గంటల వరకు సమావేశాల సెంటర్లలోనే టీచర్లు ఉంటూ ముఖహాజరుకోసం నానా ఫీట్లు చేయాల్సి వచ్చింది. కొందరు మహిళా టీచర్లు అక్కడే కూర్చుని ట్రై చేస్తూ కనిపించారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. గతంలోనూ కాంప్లెక్స్ మీటింగ్ ముగిసిన తర్వాత హాజరుపడక ఇబ్బందులు పడ్డారు. అపుడు హాజరు తప్పనిసరి అనడంతో రాత్రి 7 గంటల వరకు స్కూల్ వద్దనే కాచుకు కూర్చున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమస్య తలెత్తడంతో అప్పట్లో కావాలనే సర్వర్ డౌన్ చేశారనే విమర్శలు వచ్చాయి. విషయం విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశించారు. శనివారం కూడా సర్వర్ సమస్య తలెత్తడంతో టీచర్లు ముఖహాజరు వేయడానికి ఇబ్బంది లు పడ్డారు. విద్యాశాఖ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.


ఇక.. నిలబడలేను..

ముస్సోరీలో శిక్షణకు కలెక్టర్

ఇన్‌చార్జిగా జేసీ శివనారాయణ్ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ శిక్షణ నిమిత్తం ముస్సోరీకి వెళ్లారు. ఐఏఎస్ అధికారులకు ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ)లో నిర్వహించే మిడ్ కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాం(ఎంసీటీపీ) (23వరౌండ్ ఫేస్3)లో కలెక్టర్ పాల్గొననున్నారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 16వ తేదీ వరకు శిక్షణలో ఉండనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన బయలుదేరి వెళ్లారు. ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జేసీ శివనారాయణ్ శర్మ వ్యవహరిస్తారు.



ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి: డీఎంహెచ్ఓ


అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి.. అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో శనివారం ఆమె.. జిల్లా ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాలు సకాలంలో అమలు చేయాలన్నారు. సమీక్షలో ప్రోగ్రాం ఆఫీసర్లు యుగంధర్, అనుప, శ్రీనివాసరెడ్డి, అధికారులు కిషోర్, ఫణి పాల్గొన్నారు.

బడికి పొగ..!

(5వ పేజీ తరువాయి)

బాలికల ఉన్నతపాఠశాలలో రెండుచోట్ల వంట చేస్తున్నారు. తరగతి గదుల మధ్యలో వంట చేస్తుండటంతో కట్టెల నుంచి వచ్చే పొగ తరగతి గదులను కమ్మేస్తోంది. ఆస్తమా, అలర్జీ, ఉన్న కొంతమంది విద్యార్థులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. తరగతి గదుల్లోకి పొగ రావడంతో ఉపాధ్యాయులు కూడా ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. బాలుర ఉన్నత, బాలుర జూనియర్ కళాశాలు కలిసి బాలుర ఉన్నతపాఠశాలలో వంట వండుతున్నారు. కట్టెల మీదే వండుతున్నారు. ఈపొగ మొత్తం తరగతి గదుల వరకు వస్తోంది. కట్టెలతో వంట చేయడం వల్ల అన్నం ముద్దముద్దగా ఉంటోందని విద్యార్థులు చెబుతున్నారు. వంట చేయడా నికి గ్యాస్ సిలిండర్లను పక్కనపెట్టి టన్నులకొద్ది కట్టెలు తీసుకొచ్చి నిల్వ చేశారు. మధ్యాహ్నం అయితే చాలు పొగతో పాఠశాల ఆవరణం నిండిపోతోంది. ఇదే పరిస్థితి నల్లచెరువు ఉన్నతపాఠశాలలోనూ, ఎన్పీకుంట ఉన్నతపాఠశాలలోనూ, నల్లమాడ, ఓడీసీ, అమడగూరు తదితర ఉన్నత పాఠశాలల్లో ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులకు శ్వాసకోశ వాధ్యులు వచ్చే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.


కదిరి బాలుర ఉన్నతపాఠశాలలో వంట కోసం నిల్వ ఉంచిన కట్టెలు

కట్టెలతో వంటలు చేస్తున్న ఏజెన్సీలు

ప్రభుత్వ నిబంధనల మేరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీలు గ్యాస్‌తోనే వంట చేయాలి. ఉన్నతపాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం సన్నబియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు ఉచితంగా సరఫరా చేస్తోంది. కిరణా వస్తువులు, గ్యాస్ కోసమే ఒక విద్యార్థికి నెలకు రూ.250వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం గ్యాస్ వాడకుండా కట్టెలమీద వంట చేస్తున్నారు. దీంతో రెండు రకాల నష్టాలున్నాయి. పొగతో పాఠశాల ఆవరణం నిండిపోతోంది, భోజనం కూడా చేయడానికి సరిగా వీలుండదు. అందుకే గ్యాస్ వాడమని అధికారులు సూచించినా ఏజెన్సీ నిర్వాహకులు పట్టించుకోవడంలేదు.

గ్యాస్‌మీద చేయమని చెప్పా



మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు గ్యాస్ మీద వంట చేయాలని పలుమార్లు చెప్పా. అయినా వారు పట్టించుకోవడం లేదు. కాలేజీ విద్యార్థుల కోసం వంట చేయడానికి గదిని అక్కడే ఏర్పాటు చేశాం. త్వరలో అక్కడికి మారుస్తాం.

- వెంకటాచలం, హెచ్ఎం, బాలికల ఉన్నతపాఠశాల, కదిరి

చర్యలు తీసుకుంటాం



నిబంధనల మేరకు భోజన ఏజెన్సీలు గ్యాస్‌మీద వంట చేయాలి. అలా వంట చేయకపోతే, మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

- చెన్నక్రిష్ణ, ఎంఇఓ

క్యాన్సర్ యూనిట్ బాగయ్యేనా..!

(5వ పేజీ తరువాయి)

నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కోబాల్ట్ సోర్స్‌ను కొనుగోలు చేసినప్పుడల్లా అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్ (ఏఈఆర్‌బీ) నుంచి లైసెన్స్ తీసుకోవాలి. ప్రతి సంవత్సరం లైసెన్సును రెన్యువల్ చేసుకోవాలి. ఖచ్చితమైన ప్రమాణాలను పాటించాలి. చిన్న తప్పిదం జరిగినా లైసెన్స్ ఇవ్వరు. ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటారు. ఇంతటి క్లిష్టమైన ప్రక్రియన పూర్తి చేసి, రాజస్థాన్ నుంచి కోబాల్ట్ సోర్స్‌ను కొని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లను వెచ్చించింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఏఈఆర్‌బీ కమిటీ వచ్చి క్యాన్సర్ యూనిట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి వెళ్లింది.

పకడ్బందీగా పర్యవేక్షణ

కోబాల్ట్ సోర్స్‌ను తయారు చేసే కేంద్రం నుంచి దానిని అమర్చే ప్రాంతానికి చేర్చేవరకూ పోలీసు, ఇంటెలిజెన్స్ నిఘా ఏర్పాటు చేస్తారు. సోర్స్‌ను తరలించే దారి మొత్తం మ్యాపింగ్ చేస్తారు. ఆ మార్గంలోని సమీప పోలీస్ స్టేషన్‌లకు సమాచారం చేరవేస్తారు. కంటైనర్ నుంచి కోబాల్ట్ సోర్స్‌ను బంకర్‌లోకి చేర్చి.. టెలీ కోబాల్ట్‌లోకి అమర్చే ప్రక్రియను మొత్తం వీడియో, సీసీ కెమరాలతో రికార్డు చేస్తారు. స్క్రూటినీ మధ్య ప్రక్రియను పూర్తి చేస్తారు. పొరపాటున రేడియో యాక్టివ్ అయితే సాధారణ ప్రజానీకం ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని. అందుకే ముందస్తు జాగ్రత్తల చర్యల్లో భాగంగా పకడ్బందీగా ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. అనంతరం మిషన్ రన్ చేసి, కావాల్సిన అవుట్‌పుట్ వస్తుందని నిర్ధారణకు వచ్చినప్పుడే ప్రక్రియ పూర్తి అయినట్లు భావిస్తారు.

భవన నిర్మాణానికి ప్రణాళికలు

శారదా నగర్‌లోని క్యాన్సర్ యూనిట్‌లో వసతులు అరకొరగానే ఉన్నాయి. ఓపీ, ఐపీ, నర్సింగ్ స్టేషన్, డిస్పెన్సరీ.. ఇలా ఒక్కో విభాగం ప్రత్యేకంగా ఉండాలి. కానీ తాత్కాలికంగా ఒక షెడ్డును ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. రేడియో థెరపీ ప్రారంభమైతే, రోగుల సంఖ్య పెరుగుతుంది. అందుకు అనుగుణంగా కొత్త భవనాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. క్యాన్సర్ యూనిట్‌లోని ఖాళీ స్థలంలో భవన నిర్మాణానికి అనుమతికోసం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు. డీఎంఈ ప్రత్యేక చొరవ చూపితేనే నిర్మాణ పనులు ప్రారంభమౌతాయి.

త్వరలోనే ప్రారంభిస్తాం...



క్యాన్సర్ యూనిట్‌లో రేడియో థెరపీ సేవలను త్వరలోనే పునఃప్రారంభిస్తాం. టెలీకోబాల్ట్ యంత్రానికి సర్వీస్, క్వాలిటీ అష్యూరెన్స్ లైసెన్స్ వంటి ప్రక్రియలను ఇప్పటికే ప్రారంభించి తుది దశకు తీసుకువచ్చాం. కొత్త భవన నిర్మాణానికి ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

- డాక్టర్ ఆత్మారామ్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్

అనుమతులు కఠినతరం..



కోబాల్ట్ సోర్స్‌ను కొనుగోలుకు అనుమతులు కఠినంగా ఉంటాయి. ఏఈఆర్‌బీ అనుమతులు పొందిన తరువాత కమిటీ మన కేంద్రాన్ని పరిశీలిస్తుంది. వీడియోస్, సీసీ కెమరాలు, స్క్రూటినీ మధ్య టెలీకోబాల్ట్ యంత్రంలోకి సోర్స్‌ను అమరుస్తారు.

- ప్రొఫెసర్ సతీష్ కుమార్, రేడియో థెరపీ విభాగం


ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి సవిత

ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'లో మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదామని మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండలో గాంధీ సర్కిల్ వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, అధికారులు, నాయకులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు వురు వ్యాపారులకు మంత్రి సవిత ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల పర్యావరణం కాలుష్యమయ్యే ప్రమాదం ఉందని ఇప్పటికే శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారన్నారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, కన్వీనర్ శ్రీరాములు, సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, అడదాకులపల్లి ప్రసాద్, షౌకత్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి చేయూత ఇవ్వాలి

● జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆచార్య దేవన్న


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, ప్రొఫెసర్లు

అనంతపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి చేయూత ఇవ్వాలని జేఎన్‌టీయూ ఓఎస్‌డీ టూ వీసీ ఆచార్య దేవన్న పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆడి టోరియంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహిం చారు. వీసీ సుదర్శన్‌రావు ఆన్‌లైన్ ద్వా రా పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురించి మాట్లాడారు. తర్వాత ఆచార్య దేవన్న మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కుటుం బంతో కలిసిన అనుభూతి కలుగుతోందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన వయసును మరచిపోయి, యువకులుగా మారి పాత జ్ఞాపకా లను గుర్తు చేసుకొని ఆనందిస్తామన్నారు. అలుమ్నీ అసోసియేషన్ కళాశాలకు బలమని, యూనివర్సిటీ అభివృద్ధిలో అలుమ్నీ సభ్యుల సలహాలు, సూచనలు ఎప్పుడు తీసుకుంటామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య చెన్నారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో కళాశాల, యూనివరిటీని మరింత ముందుకు తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ప్రొఫెసర్లు , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీకి ప్రవేశాలు

● 28 వరకు దరఖాస్తుకు అవకాశం

అనంతపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద ఏర్పాటుచేసిన సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వీసీ ఎస్ఏ కోరి శనివారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి బీఏలో పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్, బీకాం, బీబీఏతోపాటు బీఎస్సీలో ఎకనామిక్స్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రీటైల్ మేనేజ్‌మెంట్, ఐటీ, బీటెక్ కంప్యూటర్ సైన్స్-ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈనెల 28 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు https://cuapcuet.samarth.edu.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గూగూడులో ఎంపీ పర్యటన


మొక్కలకు నీరుపోస్తున్న ఎంపీ అంబికా

నార్పల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గూగూడు గ్రామం లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శనివారం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మా ట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్క రూ విధిగా మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దర్శనం చేసుకున్నారు. ఇటీవల కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా పూర్తి కావడానికి విశిష్ట సేవలు అందించిన సేవా కమిటీ సభ్యులకు, అధికారులుకు, పోలీసులకు, పంచాయతీ కార్యదర్శులకు, కార్మికులకు, క్లాప్ మిత్రాలకు సన్మానం చేశారు. త్వరలోనే గూగూడులో రూ.25లక్షల నిధులతో ఆధునాతనమైన గెస్ట్ హౌస్‌ను నిర్మిస్తామని తెలిపారు. స్థలాన్ని చూపిస్తే పార్క్‌ను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. టీడీపీ నాయకులు ఆకుల అంజనేయులు, ఆలం వెంకటనరసానాయుడు, బండ్లపల్లి కుళ్లాయప్ప, మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, ఎంపీడీఓ మమతాదేవి, డిప్యూటీ ఎంపీడీఓ శైలజారాణి, ఏఈ జనార్ధన్,ఆలయ ఈఓ శోభ, ఆలయ ప్రధాన అర్చకుడు ఉసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మండల కమిటీ ఏర్పాటు

కనగానపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల నూతన కమిటీని మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా నాగముని, ఉపాధ్యక్షుడిగా ముత్యాలు, ప్రధానకార్యదర్శిగా చిన్నపెద్దిరెడ్డి ఎన్నికయ్యారు. పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, నాయకులు అమర్నాథరెడ్డి, దాసరి ప్రభాకర్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం: సీపీఎం

అనంతపురం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిలో ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ... ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. పాతమీటర్లనే కొనసాగిస్తూ, పాత రీడింగ్ పద్ధతినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వివిధ ప్రజా సంఘాలు, ఐక్యవేదికల ద్వారా చేపట్టే ఉద్యమానికి సీపీఎం సంపూర్ణ మద్దతునిస్తోందని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజా, రామాంజనేయులు, నిర్మల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏడీఏ

అనంతపురం అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఏడీఏగా అల్తాఫ్ అలీఖాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హిందూపురం ఏడీఏగా పనిచేస్తున్న ఆయన్ను అనంతపురం ఏడీఏగా బదిలీ చేస్తూ వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జేడీఏ ఉమామహేశ్వరమ్మను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

రద్దయిన పనులకు బాధ్యులెవరు?: మేయర్ వసీం

అనంతపురం కలెక్టరేట్/ అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో మంజూరై రద్దయిన పనులకు బాధ్యులెవరని నగర మేయర్ మహమ్మద్ వసీం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను ప్రశ్నించారు. మేయర్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఏడాది పాలనలో చెప్పుకోవడానికి చేసింది ఏమీ లేక పదే పదే అసత్య ప్రచారాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆమోదం తెలిపిన పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు చేస్తున్నారని ఆరోపించారు. నగరపాలక పరిధిలో రూ.19.06కోట్లతో 211 పనులకు టెండర్లు పిలిచారని, అగ్రిమెంట్ కూడా అయిన పనులను కూటమి అధికారంలోకి రాగానే రద్దు చేశారని, వీటికి బాధ్యులెవరో చెప్పాలని నిలదీశారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, రహంతుల్లా, కాకర్లశీనా తదితరులు పాల్గొన్నారు.

నేడు కనగానపల్లిలో మంత్రి కొల్లు పర్యటన

కనగానపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యే పరిటాల సునీత కనగానపల్లి మండలకేంద్రంలో ఆదివారం పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. సుపరి పాలన తొలిఅడుగులో భాగంగా కనగానపల్లిలో ఇంటింటా పర్యటించనున్నట్లు చెప్పారు. అనంతరం అక్కడి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం

అనంతపురం టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రామ్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏడుశనివారాల వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో అర్చకులు స్వామివారి మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలు వల్లించడంతోపాటు వ్రత మహిమను వివరించారు. భక్తులు సామూహికంగా ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. తర్వాత మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఏడుశనివారాల వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

మర్తాడులో నాకాబందీ

గార్లదిన్నె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడులో పోలీసులు శనివారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. అనంతరం సీఐ కౌలుట్లయ్య గ్రామస్థులతో మాట్లాడుతూ.. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. లేకుంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించమని హెచ్చరించారు. గార్లదిన్నె, శింగనమల, నార్పల ఎస్‌ఐలు మహమ్మద్‌గౌస్‌బాషా, సాగర్, విజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

అనవసరంగా కేసుల్లో ఇరుక్కోకండి: టీడీపీ

రామగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'మీ నాయకుడి మాటలు విని అనవసరంగా కేసుల్లోకి ఇరుక్కోవద్దండ'ని వైసీపీ శ్రేణులకు టీడీపీ నాయకులు సూచించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చెప్పినట్టు వింటూ లేనిపోని తగాదాల్లోకి వెళ్లి వైసీపీ నాయకులు కేసుల్లోకి ఇరుక్కుంటున్నారని అన్నారు. గత ఐదేళ్ల పాటు కక్షలు, కార్పణ్యాలు రేపారని, దీనివల్ల ఎంతో నష్టపోయామని అన్నారు. ఇప్పుడిప్పుడే అందరం ప్రశాంతంగా ఉంటున్నామని అన్నారు. మళ్లీ మీ నాయకుడి మాటలు నమ్మి అనవసర విషయాల్లో జోక్యం చేసుకొని కేసుల్లో ఇరుక్కోకండని తెలిపారు. గ్రామాల్లో అందరూ ప్రశాంతంగా ఉండాలని ఎమ్మెల్యే పరిటాల సునీత చెబుతున్నారని వారు పేర్కొన్నారు. మండల కన్వీనర్ సుధాకర్, ప్రధానకార్యదర్శి ఆవుల ముత్యాలు, నాయకులు శ్రీరాములునాయక్, నాగేశ్‌నాయుడు, విశ్వనాథ్, గంగిరెడ్డి, పేపర్‌శీన, అక్కులప్ప పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ కమిషనర్, ప్రజలు


క్లాత్‌బ్యాగులతో జిల్లా బీసీవెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, అధికారులు

అనంతను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపు
- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అనంతను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక పాతూరు మార్కెట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత నగరపాలిక అధికారులు, స్థానిక ప్రజలు, టీడీపీ శ్రేణులతో కలిసి ప్లాస్టిక్ రహిత నగరం కోసం పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. తర్వాత నగరపాలక సంస్థ, మెప్మా, డిస్కవరీ అనంతపూర్ అనిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రహిత బ్యాగుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించారు. నగరంలో ఇప్పటికే 95శాతం ప్లాస్టిక్ కవర్లను నిషేధించామన్నారు. నూరుశాతం సాధించేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఎవరైనా అనుమతి లేని ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కేసులు నమోదుకు వెనుకాడబోమని హెచ్చరించారు. తర్వాత ప్రజలకు ఉచితంగా క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని, సామాజిక సేవకుడు ఏజీ అనిల్‌కుమార్, మెప్మా పీడీ విశ్వజ్యోతి, కార్పొరేటర్లు జనబలం బాబా, చలివెందుల బాలాంజనేయులు, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పీఎల్ఎన్ మూర్తి, మాజీ కార్పొరేటర్లు బల్లా పల్లవి, రంగాచారి, పావురాల శేఖర్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషణం, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, రాష్ట్ర అధికారప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికారప్రతినిధి ఫిరోజ్‌అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

● రాప్తాడు: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాప్తాడు బీసీ బాలుర వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ వాటర్ క్యాన్‌లో నీరు తాగకూడదన్నారు. మట్టి కుండలలో నీరు మాత్రమే తాగాలని తెలిపారు. అలాగే ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. పరిశుభ్రత పాటించాలన్నారు. తర్వాత ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని అధికారులు, అక్కడిప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలకు క్లాత్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ సాకే తిరుపాలు, అనంతపురం, ఉరవకొండ, తాడిపత్రి ఏబీసీ వార్డెన్లు శుభాషిణి, మస్తాన్, రంగమ్మ, పుత్తూరు రిటైర్డ్ ఏబీసీ వార్డెన్ శ్రీనివాసులుశెట్టి, అనంతపురం జిల్లా వార్డెన్ల సంఘం అధ్యక్షుడు మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె :మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల అధికారులు, నాయకులు కలసి ప్లా స్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యోగానందరెడ్డి మాట్లాడుతూ... ప్లాస్టిక్ వస్తువులు వాడడం వల్ల అనే క నష్టాలు జరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా పర్యావరణం దెబ్బతింటుదని అన్నారు. ప్లాస్టిక్ వస్తువులు అమ్మినా, విక్రయించినా నేరమన్నారు.స ర్పంచు సుబ్బమ్మ, ఈఓఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ కార్యదర్శి ముత్యాల్‌రెడ్డి, ఏపీఓ ఓబన్న, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● అనంతపురంరూరల్: ప్లాస్టిక్ నియంత్రణకు దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులు సహకరించాలని ఎంపీడీఓ దివాకర్ కోరారు. అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని జేఎన్‌టీయూ ప్రధాన రోడ్డులో గల దుకాణాల యజమానులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ విక్రయాలు నిర్వహించకూడదని నోటీసులు జారీ చేశారు. డిగ్రేడబుల్ కవర్లను పంపిణీ చేశారు. తర్వాత స్థానిక విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అలాగే పారిశుధ్య నివారణలో కీలకంగా వ్యవహరిస్తున్న కార్మికులను సత్కరించారు. డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, సర్పంచ్ ఉదయ్ శంకర్, కార్యదర్శి శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి కనిపిస్తోంది

● సుపరిపాలనలో తొలిఅడుగులో ఎమ్మెల్యే పరిటాల సునీత


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు

అనంతపురంరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే తాము చేసిన అభివృద్ధి ప్రతి గ్రామంలోనూ కనిపిస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ బీసీ కాలనీలో శనివారం సాయంత్రం ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాప్తాడు నియోజకవర్గ పరిశీలకురాలు ఆదోని కృష్ణమ్మతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు ఏడాదిలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా తాము చేపట్టిన అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు. గత వైసీపీ నాయకులు చెప్పుకోవడానికైనా ఏమైనా చేశారా అని నిలదీశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి పాముదాయి రఘు, సర్పంచు శివశంకర్, మాజీ సర్పంచు కొండయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు మాలపాటి రాము, నాయకులు వెంకట్‌చౌదరి, పెద్దకొండయ్య, సుధీర్, సంజీవులు, బల్లా వెంకటరాముడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజం, కబ్జాలకు తావులేదు

● ఎమ్మెల్యే దగ్గుపాటి


బుడ్డప్ప నగర్‌లో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో రౌడీయిజాలకు, భూకబ్జాలకు, ఇతర అక్రమాలకు తావు లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని 22వ డివిజన్ బుడ్డప్ప నగర్‌లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేస్తూ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో అనేక అరాచకాలు జరిగాయన్నారు. ముఖ్యంగా రౌడీయిజాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు తదితరాలు అధికంగా ఉండేవన్నారు. కూటమిప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు వాటన్నింటినీ అణచివేశారని తెలిపారు. తమ పాలనలో అలాంటివాటికి చోటు ఉండదన్నారు. ప్రజలు ప్రశాంతగా జీవించవచ్చని పేర్కొన్నారు. వచ్చే నాలుగేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పుల్లన్న, జైబున్నీ, ఆనంద్, దస్తగిరి, మల్లికార్జున, లింగమయ్య, గంగారామ్, సింగవరం రవి, పీఎల్ఎన్‌మూర్తి, కడియాల కొండన్న, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, రమేష్, సంగా తేజస్విని, కృష్ణకుమార్ నెట్టెం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

పూర్తి చేసిన వారికి సన్మానం..

అనంతపురం అర్బన్: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసిన 39వ డివిజన్ నాయకులు అందరికీ ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. 39వ డివిజన్ ఇన్‌చార్జి చేపల హరి ఆధ్వర్యంలో 6 పోలింగ్ బూత్‌ల పరిధిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేశారు. 93, 94, 95, 96, 97, 98వ పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జిలు సాయినికిత్, జునైద్, భూషణ, ఉమా, జమీర్, గుణశేఖర్, శ్రీనివాసులుతో పాటు యూనిట్ ఇన్‌చార్జి కరీం బాషా, డివిజన్ నాయకులు వడ్డే సోము, వినాయక్‌రామ్‌లు ఈ కార్యక్రమం పూర్తి చేయడంలో కీలకంగా పనిచేశారు. ఇందుకుగాను అర్బన్ కార్యాలయంలో శనివారం వారిని ఎమ్మెల్యే సన్మానించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన నాయకులు కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

హెచ్చెల్సీ ఎస్‌ఈగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ఎస్‌ఈగా సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎస్‌ఈగా ఉన్న పురార్థన్‌రెడ్డి గత నెలాఖరున రిటైర్డ్ అయ్యారు. దీంతో మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈగా ఉన్న విశ్వనాథ్ రెడ్డికి హెచ్చెల్సీ ఎస్‌ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం విశ్వనాథ్‌రెడ్డిని తప్పిస్తూ అదే మైనర్ ఇరిగేషన్‌లో డిప్యూటీ ఎస్‌ఈగా పనిచేస్తున్న సుధాకర్‌కి హెచ్చెల్సీ ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో శనివారం హెచ్చెల్సీ కాలనీలో జలవనరుల శాఖ సీఈ నాగరాజను మర్యాదపూర్వకంగా కలిసిన సుధాకర్ హెచ్చెల్సీ కార్యాలయంలో ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో బీబీ ఫాతిమా పెద్దసరిగెత్తు

అనంతపురం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గూగూడు తర్వాత అంతటి ఖ్యాతి గడించిన బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని ఐదోరోడ్డులో శనివారం సాయంత్రం పెద్దసరిగెత్తు వేడుకను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం నుంచి రాత్రి వరకూ వేలాది మంది భక్తులు బీబీ ఫాతిమా పీర్లను దర్శించుకుని చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన భక్తజన సందోహంతో ఐదవరోడ్డుతోపాటు పరిసరాలు కిటకిటలాడాయి. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లికార్జున, నరసింహులు, కేఎస్ మురళీ, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.


కొలువుదీరిన బీబీ ఫాతిమా పీర్లు


దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి

రామగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పేదలకు అనేక సేవలు అందిస్తున్న ఆర్డీటీకి కేంద్రప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుంటిమద్ది ఓబులేశు డిమాండ్ చేశారు. ఈ మేరకు కుంటిమద్ది ఉన్నతపాఠశాల విద్యార్థులతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. తర్వాత కేంద్రానికి విషయాన్ని పోస్టుకార్డుల పంపారు. హెచ్ఎం పద్మనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన

అనంతపురంఅర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో శనివారం ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఉద్యాన అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రఘునాథ్‌రెడ్డి, ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టంపై అధికారులు, సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ, ఉద్యాన శాఖ ఏడీ దేవానంద్, టెక్నికల్ హెచ్ఓ రత్నకుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీకి వినతి

అనంతపురం విద్య, జూలై 19(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను కేంద్రం దృష్టికి తీసికెళ్లి పరిష్కరించాలని తపాలా ఉద్యోగులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కోరారు. జిల్లాకేంద్రంలో నివాసంలో శనివారం వారు ఎంపీని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆల్ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్, నాయకులు ఈశ్వరయ్య, ఇర్ఫాన్, నాగభూషణం, శ్రీరాములు నాగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించండి

అనంతపురం విద్య, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బీసీసంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారిని శనివారం వారు నగరంలో కలిసి మాట్లాడారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, ట్రంకుపెట్టెలు, దుప్పట్లు, దోమతెరలను వెంటనే అందించాలన్నారు. కళాశాలలు హాస్టళ్లకు దూరంగా ఉంటుండడం వల్ల విద్యార్థులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలకు హాస్టళ్లు అందుబాటులోనే ఉండేలా చూడాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, సమీర్, తరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ అభివృద్ధికి మరింత కృషి: వీసీ అనిత


వీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ తదితరులు

అనంతపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య అనిత అన్నారు. ఆమె వర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి అయింది. దీంతో వర్సిటీలోని కళాశాల విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది శనివారం ఆమెను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 2025-26వ ఆర్థిక సంవత్సరానికి జీతాలు, పెన్షన్లు కోసం రూ.100కోట్లు బడ్జెట్ విడుదల అయిందని, ఇందులో రూ.10కోట్లు కాంట్రాక్టు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందని అన్నారు. అలాగే రూసా కింద పది సెమినార్ హాళ్లు, మౌలిక సదుపాయాల కల్పించామన్నారు. రాష్ట్రంలోని ఏ విశ్వవిద్యాలయం అమలు చేయని జాతీయ విద్యావిధానం ఈ విశ్వవిద్యాలయం అమలు చేస్తోందన్నారు. కొత్తగా రెండు బీటెక్ కోర్సులు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. 14ఏళ్ల తరువాత మొదటి సారి హాస్టళ్లను అందంగా తీర్చిదిద్దామన్నారు. క్యాంపస్‌లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిచామని అన్నారు. విశ్వవిద్యాలయంలోని అందరి సహకారంతోనే ఇవన్నీ చేయగలిగామని పేర్కొన్నారు. అందరి భాగస్వామంతో విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు చేపట్టండి: ఎస్ఎఫ్ఐ

అనంతపురం విద్య, జూలై 19(ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లును వెంటనే ఆన్‌లైన్‌లో చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పరమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం డిగ్రీ కళాశాలల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీనివల్ల విద్యాసంవత్సరం మొదలై రెండునెలలైనా ఇప్పటికీ డిగ్రీ అడ్మిషన్లు చేపట్టకపోవడం దారుణమన్నారు. వేలాది మంది విద్యార్థులు అడ్మిషన్లు కోసం ఎదురుచూస్తూ మానసికవేదనకు గురవుతున్నారన్నారు. వెంటనే మంత్రి నారాలోకేష్‌చొరవతీసుకొని డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించేలా చూడాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు నాగభూషణ, విజయ్, సోమశేఖర, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఏడో రోజుకు.. మున్సిపల్ కార్మికుల సమ్మె


వినూతన్న నిరసన తెలుపుతున్న కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి ఏడోరోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు అర్ధనగ్నంగా ఆకులు కట్టుకుని స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సప్తగిరిసర్కిల్, సుభాష్ రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా ర్యాలీ చేసి తిరిగి దీక్షా శిబిరానికి చేరుకున్నారు. అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు శ్రమకు దగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకట నారాయణ, అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్, ఆ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళీ, నాయకులు పోతులయ్య, తిరుమలేష్, సుబ్బిరెడ్డి, పెన్నా, కిరణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం

- రూ.9.26కోట్లతో 58 పనులకు ఆమోదం
- అనంత నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీలో తీర్మానం


సమావేశంలో పాల్గొన్న మేయర్, కమిషనర్, సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లు, మురుగుకాలువల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. స్థానిక నగరపాలక సంస్థలో మేయర్ చాంబర్‌లో శనివారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మొదట 54 పనులు అజెండాగా ప్రతిపాదించగా...మరో నాలుగువర్క్‌లను టేబుల్ ఐటెం చేర్చారు. ఇందులో 39 రోడ్లు, మురుగు కాలవల నిర్మాణాలకు గాను రూ.9.26కోట్లు ప్రతిపాదించగా కమిటీ ఆమోదం తెలిపింది. మరో 15పనులు ఇతర త్రా ఉండగా, టేబుల్ ఐటెం నాలుగింటిలో మూడు కలిపి 18పనులకు ఆమోదం తెలిపారు. హోర్డింగ్‌ల ఏర్పాటు కేటాయింపులను సరిసమానంగా ఉండాలని సభ్యులు సూచించారు. అధ్యక్షత వహించిన మేయర్ వసీం మాట్లాడుతూ గతేడాది కాలంగా కూటమి ప్రభుత్వం హామీలు ఇస్తున్నా ఆ స్థాయిలో పనులు జరగడం లేదని, పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలని, ఇంటింటా చెత్త సేకరణ చేపట్టాలని సూచించారు. నగరంలో కుక్కలు, ఆవులతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని...పరిష్కరించాలని అన్నారు. కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కార్పొరేషన్‌లో వచ్చే ఆదాయాన్ని ఇక్కడే ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం అనుతిచ్చిందని.. గ్రీన్ చానల్ ద్వారా అందరి సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కర్నూలు, తిరుపతి, అనంతపురం కార్పొరేషన్లకు కర్నూలు సమీపంలోని గార్గేయపురం వద్ద ఉన్న 56ఎకరాల్లో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నారని.. దీంతో డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం లభించినట్లేనని తెలిపారు. ప్రస్తుతం తాత్కాలికంగా కొడిమివద్ద కంపోస్ట్‌యార్డుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు రహంతుల్లా, నరసింహులు, వినూత, ఏఎంసీ డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఈ రాజశేఖర్, ఎంహెచ్ఓ రంగస్వామి, ఈఈలు షాకీర్‌హస్సేన్, బీఎల్ నరసింహులు, ఏసీపీ శిరీష, ఆర్ఓలు, డీఈలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

శుద్ధజల ప్లాంట్ ఏర్పాటు



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

గుమ్మఘట్ట, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనబావి బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం ఉచితంగా శుద్ధజల ప్లాంటును ఏర్పాటు చేశారు. సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ప్లాంట్ రూ.1.70 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసి శనివారం ఆ ట్రస్ట్ అధ్యక్షుడు న్యాయవాది ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. సీఎస్ఆర్‌లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సీసీఎల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ సహకారంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

● కుందుర్పి : మండల కేంద్రంలో ఉన్న మహాత్మా జ్యోతి రావు పూలే బీసీ బాలుర గురుకులంలో తాగునీటి కోసం సాహితీ గగన్‌మహల్ ట్రస్టు ఆధ్వర్యంలో వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను రూ. 1.70 లక్షలు సీఎస్ఆర్ కింద సీసీఎల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ వారు వితరణ చేశారు. సాహితీ గగన్‌మహల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలి

గుంతకల్లుటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని ఆ సంస్థ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆర్డీటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పోస్టు కార్డుల ఉద్యమాన్ని నిర్వహించారు. పోస్టు కార్డులను ప్రధాన మంత్రికి పంపామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సుబ్రహ్మణ్యం నాయక్, ఓబన్న, ప్రభాకర్, రాజు, తావ్యానాయక్, ఏసుదాసు, స్వామిదాసు పాల్గొన్నారు.

● కూడేరు: కేంద్రప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడేరు, కరుట్లపల్లి పాఠశాల్లో విద్యార్థులతో రాయించిన పోస్టుకార్డులను కేంద్ర హోంమంత్రికి పంపుతున్నట్లు సంస్థ ప్రతినిధులు రమణ, సంజీవరాయుడు, సుబ్బరాయుడు తెలిపారు.

తల్లి, ఇద్దరు పిల్లల అదృశ్యం

గుత్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన మాధవి, ఆమె ఇద్దరు పిల్లల ఆదృశ్యంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె కుమారుడు, కూతురుతో రెండు రోజుల క్రితం దేవాలయానికి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం రాత్రి మాధవి తండ్రి వెంకటరాముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ను ఢీకొని ముగ్గురికి గాయాలు

గుత్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని సచివాలయం వద్ద శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన కుళ్లాయప్ప పట్టణం నుంచి ఇంటికి వెళ్తుండగా.. సచివాలయం వద్ద బైక్‌ను పక్కన నిలిపి స్థానికులతో మాట్లాడుతుండగా అతి వేగంగా వచ్చిన మరో బైక్ డీవైడర్‌ను ఢీకొని పక్కన నిలిపి ఉన్న కుళ్లాయప్ప బైక్‌ను ఢీకొంది. దీంతో కుళ్లాయప్ప తీవ్రంగా గాయపడ్డాడు. లక్ష్మీదేవి, నాగరాజు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుళ్లాయప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

కళ్యాణదుర్గం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఐదుకల్లు సమీపంలో పేకాట స్థావరంపై టౌన్ సీఐ యువరాజు ఆధ్వర్యంలో శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.60,400 నగదు, 11 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ యువరాజు తెలిపారు.

విద్యార్థినికి అస్వస్థత

ఉరవకొండ,జూలై19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ధనుశ్రీ అనే విద్యార్థినికి విష కీటకం కుట్టడంతో అస్వస్థతకు గురైంది. పాఠశాలలో ప్రార్థన సమయంలో విద్యార్థినికి విషకీటకం కుట్టడంతో పడిపోయింది. గమనించిన ఉపాధ్యాయులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థినికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

నామమాత్రంగా మండల సమావేశం

కుందుర్పి, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొన్ని శాఖల అధికారులతోనే తూతూమంత్రంగా ముగించారు. సమావేశానికి మహిళా సర్పంచ్‌ల బదులు వారి భర్తలు హాజరై పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీ, తహసీల్దార్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ భీమరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బొలికొండ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



గుత్తిరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేటలో వెలసిన నవ అహోబిల లక్ష్మీనరసింహస్వామికి వేకువజామున వివిధ పుష్పాలతో అలంకరించి ఆకుపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

గుత్తిరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గుత్తి మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని కొత్తపేట శ్రీకృష్ణ ఆలయం వద్ద శనివారం యాదవులు సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా సూర్యనారాయణ, బాలరాముడు, ఉపాధ్యక్షులుగా ఏడుగురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, సీఐ క్రిష్ణయ్య యాదవ్, రామకృష్ణ యాదవ్, చిన్నరెడ్డియాదవ్, శంకర్ మహాదేవ్, ఆదిరెడ్డి, సూరి, పురుషోత్తం, ఓబయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

ఇష్టారాజ్యంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు..!

● అనుమతులు లేకుండా ప్లాట్ల విక్రయాలు ● మామూళ్లతో అధికారుల మౌనం

పుట్లూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ప్రాంతానికి కూతవేటు దూరంలో ఉన్న పుట్లూరు మండలానికి చెందిన గాండ్లపాడు పంచాయతీలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తున్నారు. అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ఆ పంచాయతీలో ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదు వెంచర్లు ఉండగా.. ప్రస్తుతం 11కు చేరాయి. ఆ పంచాయతీలో రస్తాలను సైతం ప్లాట్లుగా మార్చారన్న ఆరోపణలు ఉన్నాయి. గాండ్లపాడు పంచాయతీ తాడిపత్రి పట్టణానికి 7కిలో మీటర్లలో ఉండడంతోనే ఆ భూములు ఎకరా సుమారు రూ.2కోట్ల వరకు పలుకుతోంది. కొన్ని వెంచర్లకు సంబంధించి అధికారులకు అమ్యామ్యాలు ఇచ్చిన వెంటనే అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా సుంకులమ్మ ఆలయం ముందు సుమారు నాలుగు ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

కంతులతో విక్రయాలు

రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎకరా రూ.25లక్షల వరకు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన వ్యాపారులు వాటిని ప్లాట్లుగా సెంట్ల ప్రకారం విక్రయిస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఒక్కసారిగా లక్షలు వెచ్చించి స్థలం కొనుగోలు చేయని పరిస్థితి రియల్ వ్యాపారులకు వరంగా మారింది. దీంతో నెలకు రూ.3500 చొప్పున 70నెలలకు కంతులు కట్టించుకుంటున్నారు. ఈ లెక్కన చూస్తే రెండుసెంట్లు రూ.2.45 లక్షల మేర పలుకుతోంది. ఎకరాపై పెట్టుబడిపోను రూ.1.75 కోట్ల వరకు లాభాలు ఆర్జిస్తున్నట్లు సమాచారం. పంచాయతీల్లో అధికారుల అనుమతులు లేకుండా వెంచర్లు వేయడంపై స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పంచాయతీలోని అధికారిని పిలిపించి ఏ అనుమతులు తీసుకున్నారో చూపించాలంటూ ప్రశ్నించినట్లు తెలుస్తోంది.



పొలంలో ప్లాట్లు వేసేందుకు పాతిన రాళ్లు

వెంచర్లు వేసిన వారికి నోటీసులు ఇస్తాం

పంచాయతీలో వెంచర్లు వేసిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు, భూమి యజమానులకు నోటీసులు జారీచేయమని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చాం. ఇంతవరకు ఆ పంచాయతీలో ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేనిపక్షంలో వెంచర్లను తొలగిస్తాం.

-అలివేలమ్మ, ఎంపీడీఓ

చంద్రబాబుతోనే సంక్షేమం: కాలవ

బొమ్మనహాళ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు వందశాతం అమలు అవుతున్నాయని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఉద్దేహాళ్ గ్రామంలో కిడ్నీ బాధితురాలు లక్ష్మీని పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, తుంగభద్ర పాజెక్ట్ కమిటీ చైర్మన్ కేశవరెడ్డి, మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు మల్లికార్జున, నవీన్, హనుమంతు, సంగప్ప, శ్రీనివాసులు, మోహన్, బాబు, నాగరాజు, మహేంద్ర, రవి, గోవిందరెడ్డి, మురళి, లేపాక్షి, మల్లన్న, రాజేష్, రవిచంద్రసాగర్ పాల్గొన్నారు.

● కణేకల్లు : ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు కణేకల్లు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానం చేశారు. తమ సంఘం అధ్యక్షుడైన చంద్రశేఖర్‌గుప్తాకు కణేకల్లు ఆదర్శభారతి సొసైటీ అధ్యక్ష పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్రగుప్తా, సురేష్, పాండు, మంజునాథ్, నవీన్, పృథ్వి, సుబ్బయ్య పాల్గొన్నారు.



కిడ్నీ బాధితురాలిని పరామర్శిస్తున్న కాలవ

చేపల పెంపకానికి అనుమతి తప్పనిసరి: డీఈఈ



శ్రీధరఘట్ట చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈఈ బలరాం

బొమ్మనహాళ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట చెరువులో చేపలు పెంపకానికి మైనర్ ఇరిగేషన్ శాఖ అనుమతి తప్పని సరిగా ఉండాలని రాయదుర్గం మైనర్ ఇరిగేషన్ డీఈఈ బలరాం అన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వేళాకోలం' అనే శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో శనివారం జేఈఈ హరిష్‌తో కలిసి అయన పరిశీలించారు. చేపల పిల్లలు వదిలేటప్పుడు ఇరిగేషన్ అనుమతి తీసుకోవాలని, వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయంలో ఇరిగేషన్‌కు 50 శాతం, పంచాయతీకి 30 శాతం, మత్స్యశాఖకు 20 శాతం పంపించాలని డీఈఈ తెలిపారు. చేప పిల్లలు వదిలేటప్పుడు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని నోటీసులు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెరువు సంఘం అధ్యక్షుడు క్రిష్ణ, టీడీపీ నాయకులు బలరాంరెడ్డి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

శ్రీధరఘట్ట చెరువు తూము ఏర్పాటుకు చర్యలు

బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట చెరువును మైనర్ ఇరిగేషన్ డీఈఈ బలరాం, హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి పరిశీలించారు. 136-862 కిలో మీటర్ వద్ద తూమును ఏర్పాటు చేసి చెరువుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

గుత్తికోట ఎక్కిన గేట్స్ విద్యార్థులు



కోట కట్టడాల గురించి వివరిస్తున్న గైడ్, సిబ్బంది

గుత్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పురాతన గుత్తికోటపై పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శనివారం ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, గైడ్ రమేష్, కోట చరిత్ర గురించి, గుత్తికోట కట్టడాల గురించి వివరించారు. కోటలోని బావులు, గుర్రపు శాల, చికటి గది, రాణిమహాల్, తదితర కట్టడాల గురించి విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ సిబ్బంది చైతన్య, ఆంజనేయులు, అమృత్, గేట్స్ కళాశాల ఆధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గేట్స్‌లో సెమినార్

● గుత్తి : పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 26 వరకు రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ బయోగ్రిడేబుల్ పాలిమర్స్‌పై సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఎండీ రఘునాథ్ రెడ్డి తెలిపారు. శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, విభాగాధిపతి హరిప్రియ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు శనివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కింద 26 మందికి మంజూరైన రూ. 54.41 లక్షలు చెక్కులను అనంతపురంలో అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశవానంద, నాగేంద్ర, నాగన్న, రహంతుల్లా, అనంతయ్య, లింగమూర్తి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా నారాయణరెడ్డి



గుత్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యదర్శిగా గుత్తి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన పలక నారాయణరెడ్డిని నియమిస్తు జిల్లా నాయకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో బీజేపీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వహించారు. తన నియామకాన్ని సహకరించినపార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

● తాడిపత్రి: బీజేపీ పట్టణాధ్యక్షుడిగా ఉన్న ఆంజనేయులును జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు రంగనాథరెడ్డి తెలిపారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

తాడిపత్రి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీరోడ్డులో ఉన్న అక్రమ కట్టడాలు తొలగించుకోవాలని బీజేపీ నాయకుడు అంబటి రామకృష్ణారెడ్డికి మున్సిపల్ వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అంబటి రామకృష్ణారెడ్డి బీజేపీ నాయకుడినని ప్రజలను మోసం చేస్తున్నాడని, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సహకరిస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షెక్షావలి, కౌన్సిలర్ మల్లికార్జున, సీటీఎన్ నాయకులు సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను తీసుకోవాలి

తాడిపత్రి, జూలై19(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రైస్‌గోడౌన్ వద్ద శనివారం కార్మికులు, సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోడౌన్‌లో పనిచేస్తున్న కార్మికులు ఆరుగురిని రేషన్ బియ్యం చోరీకి పాల్పడ్డారని విధుల నుంచి తొలగించారని, వారిని విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. దొంగిలించారన్న అపవాదుతో వారిని తీసివేయడం చాలా అన్యాయన్నారు. వెంటనే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వారు సూచించారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం



కళ్యాణదుర్గం ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్‌ను నిషేధించి ఆరోగ్యాలను కాపాడుకుందామని కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆర్డీవో వసంత బాబు హాజరయ్యారు. టీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్‌ను నివారిద్దాం అంటూ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గుంతకల్లులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు. ఉరవకొండలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో రవి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గౌస్, సర్పంచ్ లలితమ్మ పాల్గొన్నారు. కూడేరు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. బెళుగుప్పలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఈవోఆర్డీ శివరంజని, హెచ్ఎం వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఏపీవో మురళీ కృష్ణ పాల్గొన్నారు. కుందుర్పి అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శంకర్, ఉప ఎంపీడీవో హరికృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఓబులమ్మ పాల్గొన్నారు. విడపనకల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. శెట్టూరులో విద్యార్థులు, మండల స్థాయి అధికారులు ర్యాలీ చేశారు. ఎంపీడీవో జిలానీ బాషా, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంఈఓ శ్రీధర్, వైద్యాధికారి నిఖిత పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు తగ్గించాలని బొమ్మనహాళ్ ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటి ఎంపీడీఓ దాస్ అన్నారు. ఏపీఎం రామకృష్ణ పాల్గొన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత అని డీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. పామిడి పంచాయతీ కార్యాలయంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ తేజోత్స్న, డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమనాయుడు, ఏపీఓ ఆదినారాయణమ్మ, హెచ్‌డీసీ మెంబర్ పూజారి లక్ష్మీదేవి పాల్గొన్నారు. కణేకల్లులో ఈఓ ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గుత్తిలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు, డీఈఈ హేమచంద్రకుమార్, ఆర్వో కమలాకర్, సతీష్, హెల్త్‌అసిస్టెంట్ నెట్టికల్లు పాల్గొన్నారు. యాడికిలో డిప్యూటి ఎంపీడీఓ శశికళ, సర్పంచు అనురాధ, డాక్టర్ పరమేశ్వర్ పాల్గొన్నారు.



గుంతకల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ, కమిషనర్



గుత్తిలో ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్

రూ.2.3 కోట్లతో సీసీరోడ్లు: ఎమ్మెల్యే



గరీబ్ కాలనీలో మహిళతో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.2.3 కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో 22వ వార్డు గరీబ్ నగర్, 23వ వార్డు ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో అభివృద్ధి శూన్యంగా మారిందని విమర్శించారు. ఎస్సీ కాలనీలో పెరాలసిస్‌తో బాధపడుతున్న భవాని అనే మహిళకు రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందచేశారు. అనంతరం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ప్రజలతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ఆయన కూడా వారితో కలిసి టిఫిన్ చేశారు. మరో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ కల్యాణం



రుక్మిణీ కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో శనివారం రుక్మిణి, శ్రీకృష్ణ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భాగవత సప్తాహ కార్యక్రమంలో భాగంగా కన్యకా పరమేశ్వరీ దేవికి అలంకారాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఎనిమిదిన్నర నుంచి 12 గంటల వరకూ శ్రీకృష్ణ రుక్మిణీ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గోపా జగదీశ్, కందూరి కృపాకర్, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తాం: జేసీపీఆర్



వ్యాపారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, జూలై19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందు వల్ల సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పుట్లూరురోడ్డులో పనులను పరిశీలించి షాపు యజమానులతో మాట్లాడారు. అనంతరం ఉన్న సీఐ సాయిప్రసాద్‌తో సిగ్నల్స్ గురించి మాట్లాడారు. అనంతరం పలువురు తోపుడు బండ్ల వ్యాపారస్తులను వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్, బాబు, మధు పాల్గొన్నారు.

ఆషాఢం ఆఫర్‌తో తోపులాట



షట్టర్లను ఎత్తుకొని దూసుకెళ్తున్న మహిళలు

తాడిపత్రి, జూలై19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఫ్యాషన్ షాపులో ఆషాఢ మాసం సందర్భంగా పెట్టిన ఆఫర్లతో మహిళలు పెద్దఎత్తున రావడంతో తోపులాట జరిగి కొందరికి స్వల్పగాయాలయ్యాయి. శనివారం పట్టణంలో ఓ షాప కేజీ సేల్స్ రూ. 30 అని ఆఫర్లు పెట్టడంతో ఒక్కసారిగా పెద్దఎత్తున షాపింగ్ మాల్ చేరుకొన్నారు. మహిళలు పెద్దఎత్తున చేరుకోవడంతో అదుపుచేయలేక షట్టర్లను మూసివేశారు. కొందరు మహిళలు చొరబడి షట్టర్లను ఎత్తుకుంటూ షాపులోకి వెళ్లడంతో తొక్కిసలాట జరిగింది. కొందరికి స్వల్పగాయాలు కావడంతో పక్కనే కొందరిని తీసుకువెళ్లి విశ్రాంతి తీసుకోవడంతో తేరుకున్నారు. ఒకరికొకరు జుట్టు పట్టుకొని కొట్టుకోవడం లాంటి సంఘటనలు కూడా జరిగాయి. పోలీసులు కూడా ఇటువైపు రాకపోవడం ఆశ్చర్యం కలిగించింది.

పోలీసుల తనిఖీలు

గుంతకల్లుటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షికారి కాలనీలో శనివారం తెల్లవారుజామున వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని ఆరు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మనోహర్, టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ పాల్గొన్నారు.

● విడపనకల్లు : మండలంలోని మాళాపురం గ్రామంలో విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

● యల్లనూరు : మండలంలోని బొప్పేపల్లిలో నాకాబందీ నిర్వహించినట్లు ఎస్ఐ రామాంజనేయులురెడ్డి తెలిపారు.

సమన్వయంతో అభివృద్ధికి తోడ్పడాలి

డీ.హీరేహాళ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనులు చేయడం ద్వారానే గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పవిత్ర వన్నూరుస్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీడీఓ దాస్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఈ సుధాకర్‌నాయక్, పశువైద్యాధికారి అమరేశ్వరప్ప, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ పోటీలకు ఎంపిక



తాడిపత్రి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ఆర్డీటీ క్యాంప్‌నకు చెందిన మహేంద్రరెడ్డి ఈనెల 18నుంచి 21వరకు విజయనగరంలో జరిగే అండర్-23 క్రికెట్ స్టేట్ ప్రాబబుల్స్‌కు ఎంపికైనట్లు కోచ్ భార్గవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ చూపడంతో స్టేట్‌ప్రాబబుల్స్‌కు ఎంపియ్యాడని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తిరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. కరిడికొండ గ్రామానికి చెందిన రవి బైక్‌పై గుత్తికి వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో రవికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

'పుచ్చలపల్లి' ఆశయాలు ఆదర్శప్రాయం

రాయదుర్గంరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సీపీఎం వ్యవస్థాపక సభ్యుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు నేటి యువతరానికి ఆదర్శమని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున తెలిపారు. సోమవారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఆలయం పరిశీలన

కణేకల్లు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వరాలయాన్ని, రికార్డులను దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి పరిశీలించారు. ఇటీవలే కలెక్టర్‌కు ఆలయ మాజీ అర్చకులు పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. దీంతో అసిస్టెంట్ కమిషనర్ శనివారం ఆలయానికి వచ్చి రికార్డులను తనిఖీ చేశారు.